

స్కందమాతగా భ్రామరి

● వర్షం కారణంగా గ్రామోత్సవం రద్దు



శేష వాహనంపై స్వామిఅమ్మవార్లు

శ్రీశైలం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిపిస్తున్నారు. ఐదో రోజైన శుక్రవారం భ్రమరాంబికాదేవి స్కందమాతగా భక్తులను అనుగ్రహించారు. స్కందమాతగా ఆశీనురాలై చతుర్భుజాలు కలిగి పద్మం, కమలం, అభయ హస్తం ధరించి, ఒడిలో బాల షణ్ముఖుడైన కుమారస్వామి (స్కందుడు)తో భక్తులకు దర్శనమిచ్చారు. శేష వాహనంపై శ్రీశైల మల్లన్నతో కలిసి అమ్మవారు భక్తులకు కనువిందు చేశారు. అయితే వర్షం కారణంగా గ్రామోత్సవాన్ని రద్దు చేశారు. ఉత్సవ అలంకరణలో భాగంగా స్కందమాతగా అమ్మవారు, మల్లికార్జున స్వామిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ఆస్థాన సేవ నిర్వహించారు. సాయంత్రం ఆలయ దక్షిణ మాడ వీధిలో ఏర్పాటుచేసిన కళారాధన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు చేసిన నృత్యాలు, సంగీత విభావరిని భక్తులు తిలకించారు. సికింద్రాబాద్‌కు చెందిన విశాలాక్షి బృందం గానకచేరి, రాజమండ్రికి చెందిన విభూది లోవరాజు బృందం పార్వతీ కల్యాణంపై బుర్రకథ అలరించాయి. ఆలయ ఈవో శ్రీనివాసరావు, ప్రధానఅర్చకులు పర్యవేక్షించారు.

నేడు కాత్యాయని అలంకరణ : దసరా ఉత్సవాల్లో ఆరో రోజు శనివారం భ్రమరాంబికా అమ్మవారు కాత్యాయనిగా దర్శనమిస్తారు. స్వామి, అమ్మవార్లకు హంస వాహన సేవ, పుష్ప పల్లకి సేవ నిర్వహించనున్నారు.


గిరిజన సంప్రదాయ నృత్య ప్రదర్శన


వేషధారణలో కళాకారులు

ఉప్పొంగిన సిద్ధాపురం చెరువు..!

● ఆత్మకూరు - దోర్నాల రహదారిపై స్తంభించిన రాకపోకలు

● విజయవాడకు వెళ్లే వాహనాలను గిద్దలూరు మీదుగా మళ్లింపు


కర్నూలు - గుంటూరు జాతీయ రహదారిపై ఉప్పొంగి ప్రవహిస్తున్న సిద్ధాపురం చెరువు జలాలు

ఆత్మకూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా ఆత్మకూరు ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు సిద్ధాపురం చెరువు ఉప్పొంగి ప్రవహిస్తోంది. నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన నీరంతా చెరువులోకి చేరడంతో ఫారెస్ట్ బేస్ క్యాంపు సమీపంలోని అలుగు నుంచి గాలేరువాగులోకి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అదేక్రమంలో కేజీ రోడ్డు సమీపంలోని మరో అలుగు నుంచి నీరు కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి మీదుగా ప్రవహిస్తూ అటవీ ప్రాంతంలోకి చేరుతోంది. దీంతో ఆత్మకూరు - దోర్నాల రహదారిపై నీటి ఉధృతి అధికమవ్వడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఆత్మకూరు అర్బన్ సీఐ రాము సంఘటనా స్థలాన్ని సందర్శించి అటుగా వాహనాలు వెళ్లకుండా ట్రాక్టర్లను అడ్డుగా ఏర్పాటు చేయించారు. కర్నూలు, నందికొట్కూరు, ఆత్మకూరు ఆర్టీసీ డిపోల మేనేజర్లకు సమాచారం చేరవేసి విజయవాడ వైపు వేళ్లే వాహనాలను ఆత్మకూరు నుంచి కాకుండా గిద్దలూరు మీదుగా వెళ్లాలని సూచించారు. దోర్నాల పోలీసులను కూడా అప్రమత్తం చేసి ఆత్మకూరు వైపు వచ్చే వాహనాలను గిద్దలూరు, నంద్యాల మీదుగా దారిమళ్లించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ఆత్మకూరు మండలంలోని వరదరాజ స్వామి ప్రాజెక్ట్‌లో కూడా గరిష్ఠ స్థాయిలో నీటినిల్వలు చేరడంతో రాత్రి 7గంటలకు ఒక గేటు ఎత్తి నీటి విడుదల చేశారు.

జిల్లాలో మోస్తరు వర్షాలు

● పగిడ్యాలలో అత్యధికంగా 36.4మి.మీ..

● నంద్యాలలో అత్యల్పంగా 1.0మి.మీ వర్షపాతం


ఆత్మకూరు శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న పడేవాగు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అనేక మండలాల్లో శుక్రవారం మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా పగిడ్యాల మండలంలో 36.4 మి.మీ వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా నంద్యాల మండలంలో 1.0మి.మీ వర్షపాతం నమోదైంది. జూపాడుబంగ్లా 26.8, కొత్తపల్లె 26.8, శ్రీశైలం 23.4, నందికొట్కూరు 18.4, ఆత్మకూరు 18.4, పాములపాడు 11.0, మిడ్తూరు 10.4, కోవెలకుంట్ల 5.4, బండిఆత్మకూరు 5.0, డోన్ 4.8, వెలుగోడు 3.8, చాగలమర్రి 2.2, దొర్నిపాడు 2.0మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో నేడు, రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని విశాఖపట్నం తుపాను హెచ్చరికలకేంద్రం జారీచేసింది. వర్షాలతో పాటు నైరుతి దిశగా గంటకు 20 కిలోమీటర్ల నుంచి 30 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందన్నారు. గాలిలో తేమశాతం ఉదయం 78 నుంచి 85శాతం, మధ్యాహ్నం 57 నుంచి 77శాతం నమోదయ్యే అవకాశముందని వెల్లడించారు.

నేటి నుంచి అంగన్‌వాడీలకు దసరా సెలవులు

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు శనివారం నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఐసీడీఎస్ పీడీ లీలావతి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. అక్టోబరు 5నుంచి యథావిధిగా కేంద్రాలు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయండి

● ఎండీ సీహెచ్ ద్వారక తిరుమలరావు

డోన్ టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బస్సులను కండీషన్‌గా ఉంచుకుని ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలని ఎండీ సీహెచ్ ద్వారక తిరుమలరావు ఉద్యోగులు, సిబ్బందికి పిలుపునిచ్చారు. శుక్రవారం నంద్యాల జిల్లా డోన్ ఆర్టీసీ బస్టాండును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా 'స్త్రీ శక్తి'పై మహిళా ప్రయాణికులతో ఆయన మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ ఎం.శశిభూషణ్ ఆధ్వర్యంలో ఉద్యోగుల అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ రాష్ట్రంలో 1,050 కొత్త ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తెస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారక తిరుమల రావు వెల్లడించారు. ఆర్టీసీ ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. అనంతరం ఆదర్శ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రశంసాపత్రాలు పొందిన వారిలో కండక్టర్లు కె.శ్రీనివాసులు, ఎస్.రాముడు, ఆర్.ఓబులపతి, మెకానిక్ ఎస్.సుబ్బరాయుడు, కోచ్ బిల్డర్ ఎం.శేఖర్, గ్యారేజ్ సూపర్‌వైజర్ వై.గోపాల్ ఉన్నారు.

డోన్‌కు విచ్చేసిన ఏపీ ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారక తిరుమల్‌రావు ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆర్‌పీజీ 22, ఏఏఎస్, పే ఫిక్సేషన్ ఎఫ్‌ఆర్‌కు విరుద్ధంగా కొంత మంది సిబ్బందిపై జీతం నుంచి రికవరి చేయడం నిలుపుదల చేసి న్యాయం చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఆర్టీసీ ఎండీకి వినతిపత్రం అందజేశారు. 2022 నుంచి 2024 వరకు ఉన్న నైట్‌ఫుట్ అలవెన్స్ బకాయిలను ఇప్పించి అర్హులకు ప్రమోషన్లు కల్పించాలని కోరారు.


ప్రయాణికులతో మాట్లాడుతున్న ద్వారక తిరుమలరావు

శ్రీశైలం జలాశయానికి తగ్గిన వరద



శ్రీశైలం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి వరద తగ్గముఖం పట్టింది. కాగా జలాశయం 10 గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్న జలవనరుల శాఖ అధికారులు శుక్రవారం రెండు గేట్లను మూసివేశారు. 8 క్రస్ట్ గేట్ల స్పిల్‌వే గుండా 2,15,424 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు సాగనంపుతున్నారు. రిజర్వాయర్‌కు ఎగువ జూరాల స్పిల్‌వే, విద్యుదుత్పత్తి అనంతరం, సుంకేసుల, హంద్రీ 2,87,051 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం 65,820 క్యూసెక్కులు విడుదల చేశారు. శ్రీశైల డ్యాం నీటిమట్టం శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి 882 అడుగులుగా ఉండగా, నీటి నిల్వసామర్థ్యం 202టీఎంసీలుగా నమోదు అయింది.

రక్ష హాస్పిటల్ సీజ్

7

అప్రమత్తంగా ఉండండి

● వర్షాలపై సీఎస్ హెచ్చరిక


వీసీలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ హెచ్చరించారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులను అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై ప్రజలకు తెలియజేయాలని సీఎస్ విజయానంద్ అధికారులకు ఆదేశించారు. సోలార్ సంస్థలకు సంబంధించి పెండింగ్ భూ కేటాయింపులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు.

బీఐఎస్ ప్రమాణాలను పాటించాలి : కలెక్టర్

జిల్లాలోని ఆర్వో వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు బీఐఎస్ ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ రాజకుమారి హెచ్చరించారు. శుక్రవారం తన కార్యాలయంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు అన్ని ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులు క్రమం తప్పకుండా నాణ్యతా పరీక్షలు నిర్వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 364, పట్టణ ప్రాంతాల్లో ఉన్న 214 వాటర్ ప్లాంట్లలో తనిఖీలు నిర్వహించి నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపాలని అధికారులను ఆదేశించారు.


పత్తి కాయను ఆశించిన కుళ్లు తెగులు

పత్తికి విపత్తు..!

● అధిక వర్షాలతో పంటను పీడిస్తున్న తెగుళ్లు

● కుళ్లిపోతున్న కాయలు

● వానలకు నేలపాలవుతున్న తెల్లబంగారం

● ఎకరాకు రెండు మూడు క్వింటాళ్లు నష్టం

● రూ.1.250 కోట్ల విలువైన దిగుబడులు నష్టం

ఎన్నో ఆశలతో సాగు చేసిన పత్తి పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు నిండా ముంచేశాయి. అధిక తేమకు విజృంభిస్తున్న తెగుళ్లతో కష్టజీవులకు కష్టాలు.. నష్టాలు పెరుగుతున్నాయి. చెట్టుపైనే కాయలు కుళ్లిపోతున్నాయి. తీసేందుకు సిద్ధంగా ఉన్న తెల్లబంగారం నేలపాలవుతోంది. విత్తనాలు మొలకెత్తడం.. పత్తి రంగు మారడంతో రైతులు కుదేలవుతున్నారు. ఎకరాకు మూడు నాలుగు క్వింటాళ్ల దిగుబడి కోల్పోతున్నామని అన్నదాతలు ఏకరువు పెడుతున్నారు. ధరలు పతనమై ఉల్లి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. తాజాగా ఆ జాబితాలో పత్తి రైతులు చేరుతున్నారు. జిల్లాలో 5.43 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అధిక వర్షాలు కారణంగా దాదాపుగా 16 లక్షల క్వింటాళ్లు పత్తి దిగుబడులు నష్టపోతున్నామని కన్నీళ్లు పెడుతున్న పత్తి రైతుల ఆవేదనపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కర్నూలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి సాగులో కర్నూలు జిల్లా అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలో 4.02 లక్షల హెక్టార్ల (10.05 లక్షల ఎకరాలు)లో పత్తి సాగు చేశారని ప్రభుత్వ అంచనా. అందులో ఒక్క కర్నూలు జిల్లాలోనే 2.17 లక్షలు హెక్టార్లు (5.43 లక్షల ఎకరాలు)లో పత్తి సాగు చేశారు. ఎకరానికి సగటున రూ.45-50 వేలు పెట్టుబడి పెట్టినట్లు అంచనా. ఈ లెక్కన రూ.2,500 కోట్లకు పైగా పత్తి సాగు కోసం సేద్యం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కలుపులు.. ఇలా వివిధ రూపాల్లో మట్టిలో పోశారని సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త ఒకరు వివరించారు. జూన్, జూలై నెలల్లో పత్తి విత్తనాలు నాటారు. మొలకెత్తి పత్తి పచ్చగా ఏపుగా పెరుగుతుంటే కష్టాలు తీరుతాయని సంబర పడ్డారు. చెట్టుకు 15-20 కాయలు కాసి, పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలు నిలువున ముంచెత్తాయి. రైతులకు ఊహించని నష్టం మిగిల్చింది. పైన పచ్చగా కనిపించే పత్తి పంట దిగువన కుళ్లిన కాయలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి.

జిల్లాలో గత నెలలో కురిసిన అధిక వర్షాలకు మొగ్గలు, పూత రాలిపోవడమే కాకుండా అధిక తేమకు కాయలు నల్లబారి కుళ్లిపోయాయి. తాజాగా వర్షాలకు మరింత నష్టం చేకూరింది. కాయలు కుళ్లిపోవడమే కాకుండా, అరకొర ఎండలకు కాయలు పగిలి పత్తిని రేపోమాపో తీద్దామని అనుకుంటే జిల్లాలో కురిసిన వర్షాకుల నేల రాలిపోతోంది. తెల్లబంగారం రంగు మారి చెట్టుపైనే పత్తిలో విత్తనాలు మొలకలు వస్తున్నాయి.

మిగతా 7వ పేజీలో

ఐదో రోజు..

● అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



మహానందిలో స్కందమాత అలంకరణలో కామేశ్వరీదేవి

మహానంది: మహానంది క్షేత్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కామేశ్వరీ దేవి స్కందమాతదుర్గగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు యాగశాల మండపంలో చండీ యాగం, హోమాలను నిర్వహించారు. సాయంత్రం కామేశ్వరీదేవి అమ్మవారిని స్కంద మాత దుర్గగా అలంకరించి నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ పర్యవేక్షకుడు శశిధర్‌రెడ్డి, నీలకంఠేశ్వర రాజు, పసుపుల సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

కర్నూలు కల్చరల్/ బనగానపల్లె/ మంత్రాలయం/ గూడూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో దసరా దేవీ నవరాత్రి ఉత్సవాలు శోభాయమానంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం అమ్మవారిని భక్తులు స్కందమాతగా పూజించారు. ఆయా ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కర్నూలు నగరంలోని మించిన్ బజార్ పెద్ద అమ్మవారిశాలలో వాసవీ మాత చండికా దేవి అలంకరణ, పూలబజార్‌లోని చిన్న అమ్మవారిశాలలో ధనలక్ష్మీ దేవి, శ్రీలలితా పీఠంలో అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్‌లోని గీతామందిరంలో సింహవాహినిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

బనగానపల్లె మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత స్కందమాత అలంకరణలో దర్శనమిచ్చారు. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ ధనలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధరకాల పుష్పాలు, కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. గూడూరు మండలం కె.నాగలాపురంలో ఐదవ రోజు సుంకులాపరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ రాధా కృష్ణ, గ్రామ పెద్దలు గోపాల్ రెడ్డి, సురేష్, సిబ్బంది కేశవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నంద్యాల పట్టణం బాలాజీకాంప్లెక్ కల్యాణ మండపంలో రూ.5లక్షల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు



బుధవారపేటలో..



కె నాగలాపురంలో మహాలక్ష్మి దేవి అలంకరణలో సుంకులాపరమేశ్వరి దేవి



నందవరంలో స్కంద మాత అలంకారంలో శ్రీచౌడేశ్వరీమాత



గీతా మందిరంలో శ్రీసింహవాహిని అలంకరణలో అమ్మవారు



కర్నూలు నగరం దేవనగర్ యూత్ ఆధ్వర్యంలో మహాలక్ష్మిదేవి దుర్గామాత దర్శనం

నేడు, రేపు 'గుర్రం జాషువా' జయంతి వేడుకలు



కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు సాహిత్యాన్ని మలుపుతిప్పిన మహనీయుడు గుర్రం జాషువా జయంతి వేడుకలు ఆదోని, కర్నూలు ప్రాంతాల్లో శనివారం, ఆదివారం రెండు రోజులు జరగనున్నాయి. శనివారం ఉదయం 10:30 గంటలకు ఆదోని పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాల్లో అభ్యుదయ రచయితల సంఘం (అరసం), రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) సంయుక్త ఆధ్వర్యంలో జాషువా జయంతి సభను నిర్వహిస్తున్నట్లు ఎస్టీయూ ఆదోని పట్టణ అధ్యక్షుడు కె.రవి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ హాజరవుతారని తెలిపారు. అనంతరం కవి సమ్మేళనం ఉంటుందన్నారు.

● కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు మహాకవి, పద్మభూషణ్ జయంతి సభను నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్ష, కార్యదర్శులు కళారత్న పత్తి ఓబులయ్య, సి.యాగంటీశ్వరప్ప, కోశాధికారి కె.రామస్వామి తెలిపారు. ఈ సభలో ప్రముఖుల ఉపన్యాసాలు, కళాకారులచే జాషువా రచించిన పద్య, గేయాలాపన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో విద్యార్థులను ఆదుకున్నాం

● కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత చింతామెహన్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో విద్యార్థులకు ఫుల్ మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లు ఇచ్చి ఆదుకున్నామని కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చింతామెహన్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ హస్టళ్లలో విద్యార్థులకు మెస్ చార్జీలు కూడా ప్రభుత్వాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. మెస్ చార్జీలు కట్టలేక ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులు కష్టపడుతున్నారని వాపోయారు. మాదిగలకు సామాజిక న్యాయం చేయకుంటే సీఎం పదవి నుంచి దిగిపోవాలన్నారు. కర్నూలు నగరంలో అభివృద్ధి జరగలేదని, నగరంలో ట్రాఫిక్ సమస్య అస్తవ్యస్తంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు బ్యాంకుల్లో పేరుకుపోయిన రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు అశోకరత్నం, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

కర్నూలుకు చేరిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర



రాజ్యాంగ పరిరక్షణ యాత్రను ప్రారంభిస్తున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 3వ తేదీన కుప్పం నుంచి ప్రారంభమైన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర శుక్రవారం కర్నూలుకు చేరుకుంది. నగరంలోని రాజ్‌విహార్‌లోని అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దళిత విభజన దేశ విభజనకు దారి తీస్తుందేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎస్సీలు ఉన్నారని, వారిలో 800 ఉప కులాలు ఉన్నాయని చెప్పారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ హక్కులు హరిస్తున్నారని ఆరోపించారు. దాడులు, హత్యలు, అత్యాచారాలు సంఘటనలు పెరిగాయన్నారు. ఎస్సీలందరూ ఐక్యంగా ఉండాలని, ఐకమత్యంతో అధికారం ఉంటేనే ఆర్థికంగా ఎదగవచ్చని అన్నారు. ఏపీలో దళిత విభజన బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ బాబు మాట్లాడుతూ అనువునంగా రిజర్వేషన్లను 15 నుంచి 20 శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు అశోక్‌రత్నం, దళిత సంఘాల నాయకులు విద్యార్థి యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

పత్తికి విపత్తు..!

5వ పేజీ తరువాయి

ఎకరాకు మూడు నాలుగు క్వింటాళ్లు దిగుబడి నష్టపోతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారుల అంచనా మేరకు జిల్లాలో 5,43,575 ఎకరాల (2,17,430 హెక్టార్లు)లో పత్తి సాగు చేశారు. రైతులు చెబుతున్నట్లు ఎకరాకు సగటున 3 క్వింటాళ్లు దిగుబడి కోల్పోయినా 16.30 లక్షల క్వింటాళ్లు (1.63 లక్షల టన్నులు) నష్టపోవాల్సి వస్తోంది. మద్దతు ధర రూ.8,110 ప్రకారం దాదాపుగా రూ.1,250 కోట్లు విలువైన పత్తి దిగుబడులు మట్టిపాలై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విజృంభిస్తున్న తెగుళ్లు

అధిక వర్షాలు.. అధిక తేమకు పత్తి పంటపై తెగుళ్లు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం కాయకుళ్లు తెగులు రైతును కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. చెట్టుకు 15-20 కాయలు ఉంటే సగానికి పైగా కాయలు కుళ్లిపోయాయి. పగిలిన పత్తి కూడా తేమకు విత్తనాలు మొలకలు రావడమే కాకుండా తెల్లని పత్తి రంగుమారుతుంది. నంద్యాలకు చెందిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన క్షేత్రం (ఆర్‌ఏఆర్‌ఎస్), ఎమ్మిగనూరు మండలం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ చైతన్య, డాక్టర్ రాఘవేంద్ర చౌదరి, డాక్టర్ రాఘవేంద్రలు ఆదోని మండలంలోని మదిరె, పర్వతాపురం, ఆలూరు మండలం హాళేబీడు, హాలహర్వి మండలం బాపురం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పత్తి పొలాలను పరిశీలించారు. కాయ కుళ్లు తెగులు తీవ్రంగా ఉందని, చెట్టుపై కాయలు కుళ్లిపోయి పత్తి దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు.



చెట్టుపైనే పగిలిన పత్తి విత్తనాలు మొలకలు వస్తున్న దృశ్యం

చెట్టుపైనే మొలకలు వచ్చాయి



ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఎకరాకు రూ.50 వేలు చొప్పున రూ.2.50 లక్షలు అప్పు చేశా. ఎకరాకు కనీసం 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించా. పంట చేతి కొచ్చే సమయంలో అధిక వర్షాలకు కాయ కుళ్లు తెగులు వ్యాపించి చెట్టుపైనే కుళ్లిపోయింది. పగిలిన పత్తి తీసేందుకు అకాశం లేక విత్తనాలు మొలకలు వస్తున్నాయి. అరకొర పత్తి నేలరాలిపోతోంది. ఎకరాకు నాలుగు క్వింటాళ్లు చొప్పున 20 క్వింటాళ్ల దిగుబడి కోల్పోవాల్సి వచ్చింది. మద్దతు ధర రూ.8,110 ప్రకారం రూ.1.62 లక్షలు నష్టపోక తప్పడం లేదు.

● హెచ్.ఈరప్ప, నెట్రవట్టి గ్రామం, హాలహర్వి మండలం

పత్తి కాయలు కుళ్లిపోయాయి



నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేసి రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టా. మొదట్లో పంట పచ్చగా ఏపుగా పెరుగుతుంటే మూడేళ్ల కష్టాలు తీరుతాయని ఆనందం కలిగింది. చెట్టుకు 20 కాయలకు పైగా వచ్చాయి. కాయ పగిలే దశలో అధిక వర్షాలు నిలువునా ముంచేశాయి. తేమకు కాయకుళ్లు తెగులు వ్యాపించి చెట్టుపైనే కాయలు నల్లబారి రాలిపోతున్నాయి. ఎకరాకు రెండు మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.

● జగ్గుల మల్లేశ్, చింతకుంట గ్రామం, కోసిగి

కాయ కుళ్లు తెగులు వ్యాపించింది



ఆదోని, ఆలూరు, హలహర్వి మండలాల్లో నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు, స్థానిక వ్యవసాయ అధికారులతో కలసి పత్తి పంటలను పరిశీలించాం. అధిక వర్షాలు, తేమకు కాయతొలుచు పురుగు ఆశించింది. పురుగుల రంధ్రాలు ద్వారా శిలీంధ్రాలు కాయలోకి చేరుకుని కాయ మొత్తానికి వ్యాపిస్తుంది. చెట్టుపైనే కాయలు కుళ్లి పోవడం గుర్తించాం. అలాంటి కాయలు పత్తి పగిలినా నాణ్యత ఉండదు. కాయకుళ్లు తెగులు ఆశించకుండా ముందు జాగ్రత్తగా రైతులు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు, లీటరు నీటికి, స్ట్రెప్టోమైసిన్ 1 గ్రాము.. లీటరు నీటిలో కలిపి కాయకు తగిలేలా పిచికారి చేయాలి.

● డాక్టర్ రాఘవేంద్ర, ప్రధాన శాస్త్రవేత, కృషి విజ్ఞాన కేంద్రం

డెంగీతో బాలుడు మృతి

గోనెగండ్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో నరహరి(2) అనే బాలుడు శుక్రవారం డెంగీతో మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన లక్ష్మి, చిన్నరంగన్న దంపతుల కుమారుడు నరహరి. వారం రోజులుగా అతడికి జ్వరం వస్తుంది. దీంతో స్థానిక ప్రైవేటు వైద్యుల దగ్గర చికిత్సచేయించారు. జ్వరం తగ్గకపోవడంతో రక్తపరీక్షలు చేయించగా డెంగీ అని నిర్ధారణ అయ్యింది. వైద్యం కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక బాలుడు మృతి చెందాడు. ఇదిలా ఉండగా ఏడాది కాలంలో మండలంలోని పలు గ్రామాల్లో 13 డెంగీ కేసులు నమోదయ్యాయి. హెచ్‌కైరవాడి, చిన్నమరివీడు, వేముగోడు, కులుమాల, పెద్దమరివీడు, గంజహళ్లి, అయ్యకొండ, గోనెగండ్ల గ్రామాల్లో డెంగీ కేసులు నమోదైనట్లు వైద్యులు తెలిపారు.

పొలాల్లో జింక మృతి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరివరం గ్రామ మంగలదాని కుంట సమీపంలో మృతి చెందిన జింకను స్థానికులు గుర్తించారు. శుక్రవారం కుక్కలు జింకను తింటుండగా స్థానికులు కుక్కలను తరిమివేశారు. అయితే ఈ జింక సూడితో ఉండి పిల్ల జింకను ప్రసవిస్తూ మృతి చెందిందా.. లేక కుక్కల దాడిలో మృతి చెందిందా అన్నది తెలియాల్సి ఉంది. అటవీ శాఖ అధికారులు స్పందించి జింకలకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

ఓర్వకల్లులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలి

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



కల్లూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సభ, అలాగే సీఎం చంద్రబాబు దృష్టికి తెచ్చారు. శుక్రవారం ఆమె అసెంబ్లీలో మాట్లాడుతూ చదువుకున్న యువతీ, యువకుల్లో నైపుణ్యం పెంచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2014-19లో సీఎం చంద్రబాబు పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. అందులో భాగంగానే కేవలం 18 నెలల్లో ఓర్వకల్లులో విమానాశ్రయం పూర్తి చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఓర్వకల్లులో రూ.1800 కోట్లతో ఎలక్ట్రిక్ వెహికల్, 80 ఎకరాల్లో రూ.1600 కోట్లతో రిలయన్స్ బేవరేజెస్, రిలయన్స్ కన్జుమర్ పరిశ్రమలను తీసుకువచ్చామని, దాదాపు 1700 మందికి ఉద్యోగాలు 80శాతం మహిళలకే వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు.

రక్ష హాస్పిటల్ సీజ్

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ చేసి ఓగర్భిణీ మరణానికి కారణమైన రక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను శుక్రవారం రాత్రి సీజ్ చేశారు. కలెక్టర్ సిరి ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ, డీఐవో డా.నాగప్రసాద్, కల్లూరు ఆర్ఐ రంగస్వామి, వీఆర్వో ఖాదర్ బాషా, నాలుగో పట్టణ పోలీసులు పంచనామా నిర్వహించారు. జూలై 30వ తేదీ పగిడ్యాలకు చెందిన గర్భిణి శ్రీవాణికి నందికొట్కూరులోని ఓఆర్ఎంపీ అబార్షన్ చేయగా వికటించి మరణించింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన ఈఘటనపై కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పీసీపీఎన్‌డీటీ జిల్లా సలహా కమిటీ విచారణచేసి నివేదికను అప్పటి కలెక్టర్‌కు అందజేశారు. ఈ సంఘటన జరిగిన రెండు నెలలవుతోంది. కొత్తగా వచ్చిన కలెక్టర్ ఏ.సిరి గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించి శ్రీవాణి మృతికి కారణమైన రక్ష హాస్పిటల్‌ని తక్షణమే సీజ్ చేయాలని ఆదేశించారు. ఆమె ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో, డీఐవో, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, లీగల్ కన్సల్టెంట్ సుమలత, కల్లూరు ఆర్ఐ, వీఆర్వో, ఫోర్త్ టౌన్ పోలీసులు రాత్రి సీజ్ చేశారు.



రక్ష హాస్పిటల్‌ను సీజ్ చేస్తున్న డీఎంహెచ్‌వో, కల్లూరు రెవెన్యూ, పోలీసులు

పర్యాటకం.. అంతంతే..!

● పర్యాటకాభివృద్ధి ప్రతిపాదనలకే పరిమితం

● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



అభివృద్ధికి నోచుకోని సంగమేశ్వరాలయం

ఆత్మకూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి కాగితాలకే పరిమితమైంది. చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించేలా ఏపీ పర్యాటక, దేవదాయ శాఖలు గత ఏడాది ఏడు టూరిజం సర్క్యూట్లను ఏర్పాటు చేసేందుకు అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలోనే ఏకైక సరస్వతీ ఆలయంగా పేరుగాంచిన కొలనుభారతి క్షేత్రం, ఇతిహాస చారిత్రాత్మక నేపథ్యం కలిగిన సప్తనదుల సంగమేశ్వర క్షేత్రాన్ని ఏ సర్క్యూట్‌లో చేర్చకుండా విస్మరించారు. సర్క్యూట్ల పేరుతో ఆయా టూరిజం కేంద్రాలను అను సంధానం చేశారే తప్ప ఆతర్వాత వాటి ఊసే లేకుండా పోయింది. దీంతో ఆయా ప్రాంతాల్లో పర్యాటక రంగంలో ఆశించిన ఫలితాలు రాలేదని స్పష్టమవుతోంది. గత ఏడాది నవంబరు 9న శ్రీశైలానికి సముద్ర విమాన సేవలను ప్రారంభించారు. ఆతర్వాత అప్పటి నుంచి నేటి వరకు ఆ సేవలు పునరుద్ధరించబడలేదు.

బైర్లూటి ఎకో టూరిజం కేంద్రం ఓ మైలురాయి

పర్యాటకరంగం అభివృద్ధిలో బైర్లూటి ఎకో టూరిజం కేంద్రం ఓ మైలురాయి అని చెప్పవచ్చు. ఇందుకు కారణం స్వచ్ఛతే. 2017 మే 10వ తేదీన బైర్లూటి సమీపంలో నిర్మించిన ఏకోటూరిజం కేంద్రానికి విదేశాల నుంచి యాత్రికులు తరలివస్తున్నారు. నల్లమల పచ్చని అందాలతో పాటు కాటేజీలు, ఆహార పదార్థాలు, ఆహ్లాదకర వాతావరణం, జంగిల్ సఫారీ పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. చెంచుల జీవనానికి ఆర్థికంగా తోడ్పాటునందిస్తోంది.

ప్రతిపాదనలు సిద్ధం చేశాం..

నంద్యాల జిల్లా పరిధిలో పర్యాటక రంగం అభివృద్ధికి అనేక ప్రతిపాదనలను సిద్ధం చేశాం. ప్రత్యేకించి సున్నిపెంటలో 50ఎకరాల స్థలంలో ప్రైవేట్, పబ్లిక్ భాగస్వామ్యంతో హోటల్స్, వసతి తదితర సదుపాయాలను కల్పించాలని నిర్ణయించాం. సంగమేశ్వరం వద్ద నిర్మితం కానున్న తీగల వంతెన నిర్మాణాన్ని దృష్టిలో ఉంచుకుని అక్కడ 10ఎకరాల భూమిని సేకరించాం. అహోబిలంలో స్వదేశీ దర్శన్2.0 పేరిట రూ.25కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులను చేపడుతున్నాం.

● నాగార్జున, ఏవో, జిల్లా టూరిజం ఆఫీస్, నంద్యాల:

కనకదుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యేలు


కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యేలు బుడ్డా, జయసూర్య

ఆత్మకూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రులను పురస్కరించుకుని విజయవాడలోకి ఇంద్రకీలాద్రిపై వెలసిన కనక దుర్గమ్మ అమ్మవారిని శుక్రవారం శ్రీశైలం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, గిత్తా జయసూర్య దర్శించుకున్నారు. ముందుగా దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆతర్వాత అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వీరి వెంటే టీడీపీ నాయకులు వై.యుగంధర్‌రెడ్డి, బండ్లమూరి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

గిరిజనుల అభివృద్ధికి ప్రధాని కృషి


చీరలను పంపిణీ చేస్తున్న అభిరుచి మధు

మహానంది, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధి ప్రధాని మోదీ విశేష కృషి చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అబిరుచి మధు అన్నారు. శుక్రవారం మహానంది సమీపంలోని చెంచులక్ష్మీ గూడెంను బీజేపీ జాతీయ మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానాతో కలిసి పర్యటించారు. గిరిజన మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉపేంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి


మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు సాయిరెడ్డి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు సాయిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని భారతీయ కిసాన్ సంఘ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాజోలు, జొలదరాశి ప్రాజెక్టులకు సంబంధించి 10వేల ఎకరాల భూసేకరణ జరిగినప్పటికీ సంబంధిత రైతులకు ఇంతవరకు పరిహారం అందక పోవడం బాధాకరమన్నారు. అక్టోబరులోగా పరిహారం ఇవ్వకపోతే నవంబరులో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి, కార్యదర్శి మహేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు అంకాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడవుల పచ్చదనాన్ని కాపాడాలి

పాణ్యం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అడవులు పచ్చదనాన్ని కాపాడాలని యూత్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ పీడీ సీహెచ్ కృష్ణ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సామాజిక వనం అంశంపై ఉపాధి, అటవీ, సార్ఫ్ సిబ్బందికి శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో పీఎం నాయుడు, ఎస్ఏఆర్‌డీఎస్ పీవో క్రాంతి, వ్యవసాయ, హార్టికల్చర్, వెలుగు, అటవీ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్నను పరిశీలించిన శాస్త్రవేత్తలు


వివరాలు తెలుసుకుంటున్న శాస్త్రవేత్తలు

నందికొట్కూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధి కారులు శుక్రవారం పరిశీలించారు. మండలం లో 50 మంది రైతులు 500 ఎకరాల్లో నకిలీ విత్తనాలతో మొక్కజొన్న సాగు చేసి నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న పంటను అగ్రికల్చర్ ఏడీఏ గిరీష్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు మల్లేశ్వర్‌రెడ్డి, కవిత, పులిబాయి, ఈశాపర్వీన్, పరిశీలించారు. కార్యక్రమంలో నందికొట్కూరు ఏవో షేక్షావలి, రైతు సంఘం నాయ కులు రవిశెట్టి, శ్యామ్ రఫీ, ఉమేన్, పూలబాషా పాల్గొన్నారు. సీపీ ఎం జిల్లా కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.70 వేల నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

గిరిజనులు అప్రమత్తంగా ఉండాలి

మహానంది, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నల్లమల సమీపంలో నివసించే గిరిజనులు దోమకాటుకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీహెచ్ఈవో ఉసేన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మహానంది సమీపంలోని చెంచులక్ష్మీ గూడెం గిరిజనుల కు తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది గ్రామ పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫార్మసీ అధికారి చంద్రశేఖర్, ఇంజనీర్ అసిస్టెంట్ అజయ్‌కుమార్ రెడ్డితో పాటు ఆశవర్కర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగడంచ గ్రామ సమీపంలో ఈనెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హుసేన్‌బీ(65) అనే మహిళ శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. మండలంలోని తాటిపాడు గ్రామానికి చెందిన కూలీల ఆటోను జీపు ఢీకొన్న ఘటనలో 15మందికి గాయపడిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పదోన్నతిపై వెళ్లడం ఆనందం: ఎంపీపీ

మహానంది, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహానంది ఈవోఆర్డీ నాగేంద్రుడు పదోన్నతిపై ఆత్మకూరుకు వెళ్లడం ఆనందంగా ఉందని ఎంపీపీ యశస్వినీ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహమ్మద్‌దౌలా ఆధ్వర్యంలో ఈవోఆర్డీని సిబ్బంది సన్మానించారు. సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల మున్సిపాలిటీకి 21వ స్థానం

నంద్యాల టౌన్ సెప్టంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్‌లో 2.0లో భాగంగా అన్ని మున్సిపాలిటీల్లో సర్వే నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వెల్లడించిన ర్యాంకింగ్‌లో నంద్యాల మున్సిపాలిటీకి 21 స్థానం లభించింది. రాష్ట్రంలో మొత్తం 123 మున్సిపాలిటీలు ఉండగా నంద్యాలలో జిల్లాలో నంద్యాలకు 21 స్థానం, ఆళ్లగడ్డకు 90 స్థానం, నందికొట్కూరుకు 106 స్థానం, ఆత్మకూరుకు 115, డోన్‌కు, 117, బేతంచెర్లకు 116 స్థానం వచ్చింది. సర్వేలో ముఖ్యంగా ఇంటింటి చెత్త సేకరణ, సేకరించిన చెత్తను ఎలా ప్రసెసింగ్ చేస్తున్నారు.. నీటి వనరులు, నీటి నిల్వలు, మున్సిపాలిటీలకు ఆదాయం ఎంత వస్తుంది.. ఎలా చేస్తున్నారు.. ఇప్పటికి ఎంత చేశారు. పన్నులు వసూళ్లు, తీసుకుం టున్న నిర్ణయాలు, అవగాహన సదస్సులు, మురుగు కాల్వలు శుభ్రత, ప్లాస్టిక్ వినియోగం, వీధిదీపాలు, రోడ్లు పబ్లిక్ టాయిలెట్లు శుభ్రత వంటి వాటిని పరిగణలోకి తీసుకుని ర్యాంకింగ్‌లు కేటాయించారు.

ఎడతెరిపిలేని వర్షం

- లోతట్టు కాలనీల్లోకి చేరిన వర్షపు నీరు
- ఉధృతంగా ప్రవహించిన భవనాశి, పడేవాగు


ఆత్మకూరులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఆత్మకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. గురువారం అర్ధరాత్రి నుంచి మొదలైన వర్షం శుక్రవారం సాయంత్రానికి కూడా తగ్గుముఖం పట్టలేదు. శుక్రవారం 8.30గంటల వరకు ఆత్మకూరులో 74.4మిమీల వర్షాపాతం నమోదు అయింది. పట్టణంలోని లో తట్టు కాలనీల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. అదేవిధంగా పంటపొలాల్లో కూడా వర్షపు నీరు భారీగా నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపునీరు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణం మీదుగా ప్రవహించే గుండ్లకమ్మ, పీతురువాగులతో పాటు పట్టణ శివార్లలోని భవనాశి, పడేవాగు ఉధృతంగా ప్రవహించాయి. కాగా భారీ వర్షాలతో ఆత్మకూరు మండలంలోని సిద్దాపురం చెరువులో, కొట్టాలచెరువు సమీపంలోని వరద రాజస్వామి ప్రాజెక్టులో గరిష్ట స్థాయిలో నీటినిల్వలు చేరాయి.

బండిఆత్మకూరు: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున ఈదురు గాలులతో వాన మెదలై సాయంత్రం వరకు ఏమాత్రం ఆగకుండా కురుస్తూనే ఉంది. ఆరుతడి పంటలకు నష్టం వాటిల్లుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల వాగులు, వంకలు పొంగి పొర్లి ప్రవహిస్తుండటంతో పికప్ అనకట్ట వద్ద వరద ఉధృతి పెరగటంతో కుందూనదికి నీటిని వదిలారు.

పాములపాడు: మండలంలో కురుస్తున్న వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శుక్ర వారం పాములపాడు నుంచి చెలిమిల్ల వెళ్లే రహదారిలో గల భవనాశి, ఎద్దులవంక, సుద్దవాగుల నీటి ప్రవాహం పెరిగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

పగిడ్యాల: అల్పపీడన ప్రభావంతో మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. మండల వ్యాప్తంగా 36.4 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రధాన రోడ్ల గుండా వర్షం నీరు నిలిచి ప్రజల రాకపోకలకు ఇబ్బందులుగా మారాయి.

కొత్తపల్లి: మండలంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు 72.10 మీ.మీల వర్షపాతం నమోదైంది. ఏకదాటిగా కురుస్తున్న భారీ వర్షానికి శివపురం ఎద్దులేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చేతికొచ్చిన మొక్కజొన్న, పత్తి, మునగ పంటలు దెబ్బతిన్నాయంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే నందికుంట గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై భారీ ఎత్తున వర్షం నీరు వచ్చి చేరుతుండటంతో గ్రామస్థులతో పాటు పై గ్రామాలకు వెళ్లే ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలాఉంటే కొత్తపల్లి తాండవ మల్లేశ్వరస్వామి ఆలయంలోని వర్షంనీరు చేరింది.


బండిఆత్మకూరు: సంతజూటూరు ఆనకట్ట వద్ద పెరిగిన వరద


కొత్తపల్లి: ఉప్పొంగిన శివపురం ఎద్దులేరు వాగు

ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి


ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎయిడ్స్ నియంత్రణ ఆధ్వర్యంలో సమగ్ర ఆరోగ్య ప్రచార రథాన్ని కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ అవగాహనతోనే ప్రజల్లో 50శాతం ఆరోగ్య సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఎయిడ్స్‌తోపాటు ఇతర ఆరోగ్య సమస్యలను ప్రజలు తేలికగా ఎదుర్కొనే విధంగా వైద్య సిబ్బంది నిరంతరం కృషిచేయాలన్నారు. సమయానికి సరైన మందులువాడితే వ్యాధులను పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ విషయంలో ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. సమగ్ర ప్రచార రథంలో అమర్చిన ఎల్ఈడీ స్ర్కీన్ ద్వారా ప్రజలకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయవ్యాధి అధికారి డాక్టర్ శారదాబాయి మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణ సమితి మార్గదర్శకత్వంతో ఏపీ సాక్స్ ఆధ్వర్యంలో జిల్లాలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 15రోజులపాటు ఈ ప్రచార రథం ద్వారా జిల్లాలో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.వెంకటరమణ, వైద్యాధికారులు కాంతారావునాయక్, అవినాష్‌రెడ్డి, తేజస్విని, నౌషీన్, ఏపీ సాక్స్ ప్రోగాం గణాంకాధికారి దేవిశంకర్‌గౌడ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నాగరాజు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

డ్రైనేజీల పరిశీలన


కాల్వలను పరిశీలిస్తున్న గోపిచంద్

మహానంది, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లి ఆర్ఎస్‌లోని మ్యాజిక్ డ్రైన్ నిర్మాణాన్ని శుక్రవారం రాష్ట్ర స్థాయి ఎన్ఆర్‌జీఎస్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, కేసీ కెనాల్ కమిటీ చైర్మన్ బన్నూరి రామలింగారెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ అస్లాంబాషా అధ్యక్షతన గ్రామంలో ఎన్ఆర్‌జీఎస్ క్యూసీ గోపిచంద్, పీడీ సూర్యనారాయణ రావుల బృందం రాయలసీమ నుంచి వచ్చిన వారికి శిక్షణ ఇవ్వడంతో పాటు గ్రామంలోని మ్యాజిక్ కాల్వల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ యశస్విని, ఎంపీడీవో మహమ్మద్ దౌలా, ఏపీవో మల్లిఖార్జునయాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

గో సంరక్షణ పథకానికి విరాళం

శ్రీశైలం,సెప్టెంబర్ 26, (ఆంధ్రజ్యోతి): శ్రీశైలందేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ పథకానికి విజయవాడకు చెందిన పి.బాలసుబ్రమణ్య శ్రీనివాస్ కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకుడు కె. అయ్యన్నకు విరాళాల కేంద్రం వద్ద అందజేశారు. దాతలకు దేవస్థానం తరుపున రశీదు, ప్రసాదాలు అందజేసి శేషవస్త్రముతో సత్కరించారు.

సబ్‌జైలు తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న న్యాయాధికారి

నందికొట్కూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైల్‌ను నందికొట్కూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభారాణి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌జైలు పరిసరాలు పరిశీలించారు. జైలులో ఉన్న ముద్దాయిలను భోజన, వైద్య సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారికి ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ఏదైనా సందేహాలు నివృత్తి చేసుకోవడం కోసం జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్ నంబరు 1500 ద్వారా కూడా తమ సమస్యలను తెలుపవచ్చునన్నారు. 70 సంవత్సరాల వయస్సు పైబడిన వారి వివరాలను జైలు అధికారులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఐలమ్మ జయంతి


విద్యార్థులను సన్మానిస్తున్న రజకసంఘం నాయకులు

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమర యోధురాలు ఐలమ్మ జయంతిని శుక్రవారం జూపాడుబంగ్లాలో ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆమె చేసిన పోరాటాలను రజక సంఘం నాయకులు రామాంజనేయులు, మౌలాలి, నాగభూషణం కొనియాడారు. అనంతరం రజక విద్యార్థులు నీట్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించి న తంగడంచ గ్రామానికి చెందిన ఛత్రపతిశివాజీ, నందికొట్కూరుకు చెందిన జగనాథ్‌ను సత్క రించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు ఎర్రన్న, కాంగ్రెస్ నాయకురాలు షాజహాన్ పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

పాణ్యం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని వైద్య నిపుణురాలు డాక్టర్ డి. ఫాతిమా అన్నారు. స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో అమ్మాయిలు, మహిళల ప్రవర్తనలో మార్పులు అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత సెల్ సమన్వయకర్త హరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు ప్రభుత్వం చేయూత

గోస్పాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం శక్తితో ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందిస్తుందని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జూలేపల్లెలో పొదుపులక్ష్మి గ్రూపు సభ్యురాలు రమాదేవికి రూ.50వేల విలువచేసే ఎంబ్రాయిడరీ మిషన్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్, ఏపీఎం శ్రీనివాసులు, సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పూజా పీటలు వితరణ

మహానంది, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో పూజల కోసం వేదపండితులు ఉపయోగించేందుకు వీలుగా 15 పూజా పీటలను దాతలు అందచేసినట్లు ఆలయ వేదపండితులు చండూరి రవిశంకర్ అవధాని తెలిపారు. శుక్రవారం పాణ్యం గ్రామానికి చెందిన వసంతకుమార్‌శర్మ, పద్మావతి దంపతులు టేకు కర్రతో తయారు చేయించిన పీటాలను అందజేసినట్లు తెలిపారు. దాతలను సన్మానించి, ప్రసాదాలు అందజేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

నంద్యాల టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణం పద్మావతి నగర్‌లోని పీజేఎం జూవెలరీ మేనేజర్ చిద్విలాస్‌రెడ్డి, క్యాషియర్ రమేశ్, ఇన్‌వెంటరీ పర్సన్ లహరీన్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అస్రర్‌బాషా శుక్రవారం తెలిపారు. దుకాణంలో జరుగుతున్న ఆడిట్‌లో బంగారు అభరణాలు లేకపోవడం, లెక్కల్లో అవకతవకలు ఉం డడంతో సంస్థ ఏజీఎం రాఘవ ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వివరించారు.

నాలుగు బైక్‌లకు నిప్పు

నంద్యాల టౌన్ సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం వైఎస్ నగర్‌లో శుక్రవారం నాలుగు బైకులను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు తాలుకా సీఐ ఈశ్వర య్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం తెల్లవారు జామున వైఎస్ నగర్‌లో నివాసం ఉంటున్న తిరుమల రెడ్డి, మరో ముగ్గురు బైక్‌లను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి అంటించినట్లు తెలిపారు. వీటి విలువ సుమారుగా రూ.2.5 లక్షలు ఉంటుందని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చేపల వేటకెళ్లి వ్యక్తి మృతి

పాములపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగూడూరు గ్రామ శివార్లలోని తెలుగుగంగలో చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి బాలయ్య(56) అనేవ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాలకు చెందిన బాలయ్య జీవనోపాధి నిమిత్తం గత రెండు వారాల కిందట వచ్చాడు. చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు తెలుగుగంగలో పడిపోయాడు. గమనించిన జాలర్లు నీటిలో గల్లంతైన వ్యక్తిని వెలికి తీసేలోపు మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపారు.

జగన్మాతా.. పాహిమాం..

- జిల్లాలో కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

దసరా శరన్నవరాత్రుల మహోత్సవం సందర్భంగా శుక్రవారం ఐదో రోజు ఆయా ఆలయంలో, మండపాలలో అమ్మవార్లు మహాలక్ష్మీదేవిగా, కాత్యాయనీగా , స్కందమాతగా దర్శనమిచ్చారు. అమ్మవారికి సుప్రభాత సేవ, విశేష అభిషేకాలు, పంచామృతాలతో, పంచ ద్రవ్యములతో అభిషేకించి పూజలు నిర్వహించారు. అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. పలు ఆలయాల్లో, మండపాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి జీవిత చరిత్ర నృత్య రూపకంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమాలు భక్తులకు ఆకట్టుకున్నాయి.

● ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


నంద్యాల కల్చరల్: అమ్మవారిశాలలో మహామాయిదేవి అలంకారంలో అమ్మవారు


నందికొట్కూరులో..


ఆత్మకూరులో..


నంద్యాల కల్చరల్: సంజీవనగర్ రామాలయంలో మహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు


వెలుగోడు: పట్టణంలోని అమ్మవారిశాలలో మహాలక్ష్మి అలంకరణలో..


పగిడ్యాల: నెహ్రూనగర్‌లో మహాలక్ష్మీ అలంకరణలో దుర్గామాత


జూపాడుబంగ్లా : స్కందమాత అలంకరణలో సరస్వతీ అమ్మవారు


పాణ్యం: ఆలమూరులో శ్రీమహాలక్ష్మి అలంకారంలో ..


బండిఆత్మకూరు : ఓంకారంలో మహాలక్ష్మీగా..


ఆత్మకూరులో స్కంధమాతాదేవీ అలంకరణలో వాసవీమాత

వివిధ రూపాల్లో అమ్మవారు

దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ నియోజకవర్గాల పరిధిలోని ఆలయాలు, మండపాల్లో అమ్మవారు శుక్రవారం వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తమ కష్టాలు తీర్చాలని వేడుకున్నారు. ● ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



చాగలమర్రి: బిల్వవృక్ష నివాసిని అలంకారంలో గల అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు



కోవెలకుంట్ల: ధనలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు



రుద్రవరంలో గౌరీదేవి అలంకారం..



ఆళ్లగడ్డలో శ్రీలలితా పరమేశ్వరీ దేవిగా...



మహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు



దొర్నిపాడు: మహాలక్ష్మీదేవి అలంకారం



కొలిమిగుండ్ల: మహాలక్ష్మీ అలంకరణ



అవుకులో అన్నపూర్ణాదేవిగా..



మహాలక్ష్మి దేవి అలంకరణలో వాసవి మాత



డోన్‌లో మహాలక్ష్మి దేవి అలంకరణలో అమ్మవారు



బేతం చెర్లలో అన్నపూర్ణాదేవి అలంకరణ



ఆళ్లగడ్డ:ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి



శిరివెళ్ల: మహాలక్ష్మీ దేవి అలంకారం



ప్యాపిలి: శైలపుత్రిదేవి అలంకరణలో దుర్గామాత



బనగానపల్లెలో శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా..

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4 సర్వే



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో తాహిర్‌హుసేన్

చాగలమర్రి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4 సర్వే నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో తాహిర్ హుసేన్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులచే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం ప్రభు త్వం పీ-4 సర్వే చేపట్టిందన్నారు. ఆయా శాఖల ఉద్యోగులు పీ-4 సర్వేను ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలను నమోదు చేయాలన్నారు. బంగారు కుటుంబాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. స్వమిత్వ సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఏవో రాజేంద్రప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

వరికి తెగులు.. ఆందోళనలో రైతులు



కొండమాయపల్లెలో వరి పైరుకు తెగులు సోకిన దృశ్యం

రుద్రవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండలంలో ఖరీఫ్ సీజనులో సాగు చేసిన వరి పైరుకు తెగులు సోకింది. వ్యవసాయ బోరుబావులు, తెలుగుగంగ కాల్వలు, చెరువుల కింద 6335 హెక్టార్లలో వరి సాగు చేశారు. వర్షాలకు ఎర్రతెగులు సోకడంతో పాటు సులిపురుగు, దోమ దాడి చేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారులు స్పందించి సాయం అందించాలన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు అవసరం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ సురేశ్

చాగలమర్రి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని ఎస్ఐ సురేశ్ అన్నారు. శుక్రవారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి సూపర్-7 క్రికెట్ పోటీలను ప్రారంభించారు. చిన్న బోదనం గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారుడు ఠాగూర్ జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో వివిధ గ్రామాలకు చెందిన 28 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు షాహిద్, అలెక్స్ తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు నగదు అందజేస్తారన్నారు. అనంతరం ఎస్ఐ సురేష్‌ను క్రీడాకారులు సన్మానించారు. కార్యక్రమంలో దాతలు షాహిద్, అలి, జవాన్, దస్తగిరి, శివ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి

చాగలమర్రి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలకు పంట నమోదు చేసుకోవాలని ఏవో రంగనేతాజీ తెలిపారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 13 వేల మంది రైతులకు గాను 9 వేల మంది రైతులు పంట నమోదు చేసుకున్నారన్నారు. భారీ వర్షాలతో 360 హెక్టార్లలో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశామని, పరిహారం కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు మంజుల, రేవతి ఉన్నారు.

పారిశుధ్యంలో సీఆర్పీలే కీలకం



కంపోస్టు ఎరువు తయారీ గురించి వివరిస్తున్న రీసోర్సు పర్సన్ దస్తగిరి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల పారిశుధ్యంలో సీఆర్పీలే కీలకం అని ఎంపీడీవో ఉమామహేశ్వర రావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎల్‌టీసీలో ఆయా మండలాల సీఆర్పీలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా రీసోర్సు పర్సన్ దస్తగిరి మాట్లాడుతూ ప్రతి వెయ్యి కుంటుంబాలకు ఒక సీఆర్పీని నియమించి, వారి ద్వారా గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తు న్నామన్నారు. తడిపొడి చెత్తను ఎలా వేరు చేయాలని, వాటిని చెత్త సంపద కేంద్రానికి ఎలా తరలించాలి అన్న దానిపై శిక్షణ ఇచ్చామన్నారు. అలాగే వర్మీ కంపోస్టు ఎలా తయారు చేయాలన్నది వారికి వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో శిరివెళ్ల, రుద్రవరం, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, చాగలమర్రి గ్రామాల సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

క్రిష్ణగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల ద్వారా రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తామని తహసీల్దార్ ప్రకాష్‌బాబు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తామన్నారు. అలాగే కొత్తగా రేషన్ కార్డులు మంజూరైన వారికి కూడా స్మార్ట్ కార్డ్‌లు అందజేస్తామన్నారు.

గ్రామ తలారి మృతి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంపమల్లకు చెందిన గ్రామ తలారి వెంకట నారాయణమ్మ (52) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. గ్రామ స్థులు, ఆమె బంధువులు తెలిపిన వివరాల మేరకు.. వెంకట నారాయణమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేదని, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందిందని తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామం కంపమల్లకు తీసుకువచ్చారు. మృతుని కుమారుడు వెంకటగణేశ్‌కు గ్రామ సేవకుల సంఘం నాయకులు ఆర్థిక సాయం అందించారు. ఈమె మృతి పై తహసీల్దారు సంతాపం తెలిపారు.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌ను కలిసిన బీజేపీ నేతలు



మొక్కను నాటుతున్న డైరెక్టర్ మురళినాయుడు, నాయకులు

డోన్ టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన్మదిన పక్షోత్సవాల్లో భాగంగా అమ్మ పేరు మీద ఒక మొక్క నాటాలనే కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులై డోన్‌కు మొదటిసారి విచ్చేసిన మురళి నాయుడును డోన్ బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. బీజేపీ నాయకులు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి, ఆర్మీ రామయ్య, ఎస్టీ మోర్చా నాయకులు శివశంకర్, దబ్బల దేవేంద్రుడు, ఓబీసీ నాయకులు ఉమ్మాజీరావ్, ఉల్చాల లక్ష్మణ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చేయూతను సద్వినియోగించుకోవాలి

బేతంచెర్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే చేయూతను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మహబూబ్ బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో డోన్ పరిశ్రమల అభివృద్ధి అధికారి శివప్రసాద్ ఆధ్వర్యంలో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు, ప్రభుత్వం అందించే ప్రోత్సాహంపై ఎంఎస్ఎంఈ కోఆర్డినేటర్లు కృష్ణమూర్తి, వెంకటరమణ అవగాహన కల్పించారు. చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా లక్ష నుంచి రూ.50 లక్షల వరకు రుణాలు అందజేస్తామన్నారు. స్లాబు, ఔడర్, ప్లాస్టిక్ గార్మెంట్స్, వెల్డింగ్, యూనిట్లు వంటి చిన్న తరహా పరిశ్రమలు ఏ ర్పాటు చేసుకుంటే 45 శాతం రాయితీతో రుణాలు ఎస్సీ ఎస్టీలకు వాహనాలకు 45 శాతం రాయితీతో రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

వంద శాతం టీకాలు వేయించండి

సంజామల,సెప్టెంబరు 26,(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పాడి పశువులు, ఆవులు, ఎద్దుల్లో ప్రబలుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను 100శాతం పూర్తి చేయాలని పశు సంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.వి రమణయ్య పశువైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం సంజామల ప్రాంతీయ పశువైద్యశాలలో ఏడీ కొండారెడ్డి ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డాక్టర్లు క్రిష్ణ కుమార్, రామ్‌కుమార్ రెడ్డి, బ్రహ్మనందరెడ్డి పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

శిరివెళ్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు లెప్రసీ, టీబీ విభాగం జిల్లా అదనపు వైద్యాధికారిణి శారదాబాయి తెలిపారు. స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా శిరివెళ్ల పీహెచ్‌సీలో ప్రారంభించారు. 150 మంది మహిళలు, కిశోర బాలికలకు వైద్యం అందించారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

దొర్నిపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శివప్రసాద్ అన్నారు. శుక్రవారం వెలుగు ఏపీఎం బాబు ఆధ్వర్యంలో స్త్రీశక్తి భవన్‌లో ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం హనిఫా, మండల ఇన్‌చార్జి పర్యవేక్షకుడు ఆదినరసింహా, డీఆర్‌డీఏ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

గజవాహనంపై వేంకటేశ్వర స్వామి ఊరేగింపు



గజవాహనంపై వేంకటేశ్వర స్వామి ఊరేగింపు

బేతంచెర్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో వెలసిన వేంకటేశ్వరస్వామిని శుక్రవారం సాయంత్రం గజవాహనంపై మేళతాళాలు, భాజా భజంత్రీల మధ్య ఊరేగించారు. ఈ ఊరేగింపు గౌరిపేట, పాత ఎమ్మార్వో కార్యాలయం, అంగళ్లబజారు, వీదుల మీదుగా ఘనంగా సాగింది. స్వామివారికి కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మారుతి కృష్ణణ్ శర్మ, కమిటి సభ్యులు వెంకటరమణ, గౌరి హుశేన్ రెడ్డి, నాగ మోహన్, తెలుగు వెంకటరమణ పాల్గొన్నారు.

రేణుకా యల్లమ్మ ఉత్సవాలకు ఆహ్వానం

డోన్ టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా డోన్‌లోని రేణుకా ఎల్లమాంబేశ్వరి దేవాలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలని డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ బాషాను ఆలయ ప్రధాన సేవకుడు ఏఈ నాగరాజుగౌడుకు శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. పురోహిత్ బ్రాహ్మణ సంఘం నాయకులు ఏసీ కృష్ణమూర్తి పంతులు, కాలువ ఓం నారాయణ, మధుశేఖర్, రాష్ట్ర చెక్కభజన మండలి అధ్యక్షుడు రాంపల్లి శ్రీను, సోమనాగిరెడ్డి పాల్గొన్నారు.

త్రిశక్తి దుర్గ భవానీకి పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా బేతంచెర్ల పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన త్రిశక్తి దుర్గామాతను భక్తులు శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహా మంగళహారతులు ఇచ్చి పూజలు చేశారు ఈ కార్యక్రమంలో బేతంచెర్ల మండల సహకార సంఘం సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్, టీడీపీ నాయకులు విజయుడు, షేక్షావలి చౌదరి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. త్రిశక్తి దుర్గామాత నిమజ్జన కార్యక్రమం సందర్భంగా అమ్మవారి సారె వేలంపాట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే భక్తులు రూ.100 చెల్లిస్తే లక్కీడ్రాలో గెలుపొందిన వారికి ఈ అమ్మవారి సారెను ఉచితంగా అందజేస్తామని తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మరమ్మతుల అనంతరం కోవెలకుంట్ల- జమ్మలమడుగు రోడ్డు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రూపనగుడి గ్రామ చెరువు అలుగు వద్ద కోవెలకుంట్ల - జమ్మలమడుగు జాతీయ రహదారిపై 'వరదల ధాటికి దెబ్బతిన్న రోడ్డు' అన్న శీర్షికన కథనం ఆంధ్రజ్యోతిలో ఈ నెల 25వ తేదీన ప్రచురితం అయింది. ఇందుకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి స్పందించారు. రోడ్డుకు మరమతులు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించటంతో వారు వెంటనే స్పందించి రోడ్డుకు కంకరవేసి మరమ్మతులు చేశారు. దీంతో ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

దొర్వి క్షేత్రం.. ప్రకృతి సోయగం..



నల్లమల అటవీతీరంలో పచ్చదనం మధ్య దొర్వి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం

రుద్రవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం సమీపంలోని నల్లమల అటవీతీరంలో పచ్చని అందాల మధ్య దొర్వి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం ఉంది. ప్రకృతి సోయగానికి కేరాఫ్ నల్లమల తీరం. ఎత్తయిన కొండలు, భారీ వృక్షాలు, పచ్చని పంట పొలాల మధ్య ఈ దేవాలయం ఉంది. కొండలపై ఉన్న చెట్లపై మేఘం వాలిన ప్రకృతి అందాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

పశువుల వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం మల్లేవేముల గ్రామంలో పశువుల టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ పశువులకు గాలికుంటు నివారణ కోసం టీకాలు వేస్తున్నామని తెలిపారు. రైతులు పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని,పశువైద్య సిబ్బందికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ ప్రతిఫలాలు అందరికీ అందాలి



జీఎస్టీలో వివిధ స్లాబ్‌ల గురించి వివరిస్తున్న అధికారులు

క్రిష్ణగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ప్రతిఫలాలు ప్రజలందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో రామస్వామి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాయాంలో అధికారులు, రేషన్ డీలర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మారిన జీఎస్టీ వివిధ స్లాబ్‌ల గురించి వివరించారు.

అరటి సాగులో మెలకువలు పాటించండి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అరటి సాగులో రైతులు మెళకువలు పాటించాలని ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉద్యానవన పంటలకు ప్రభుత్వం అనేక విధాలుగా సహాయం అందించి ప్రోత్సహిస్తోందని అన్నారు. అరటి రైతులు తగు మెళకువల ద్వారా అరటి దిగుబడిని పెంచుకుని అభాలు అర్జించవచ్చన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫేజ్-2లో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి శుక్రవారం తెలిపారు. కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకాం కంప్యూటర్స్ తదితర అన్ని కోర్సులు ఉన్నాయన్నారు.శిరివెళ్ల, రుద్రవరం మండలాల్లోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించండి: ఎస్పీ

డోన్ టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డోన్ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితుల పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ సునీల్ షేరాన్ అధికారులకు సూచించారు. శుక్రవారం డోన్ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి, పట్టణంలోని జాతీయ రహదారులను పరిశీలించారు. పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా ఉండాలన్నారు. పట్టణంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా పోలీస్ బీట్ పెంచి గస్తి పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పి.శ్రీనివాస్, అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ రాకేష్, ఎస్ఐలు శరత్ కుమార్ రెడ్డి, నరేంద్ర కుమార్ రెడ్డి, మమత, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొనాన్నారు.

మొక్కజొన్న వర్షార్పణం



మొక్కజొన్న పంటపై పట్టాలు కప్పుతున్న రైతులు



రుద్రవరంలో నేలవాలిన మొక్కజొన్న

చాగలమర్రి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎడతెరిపి లేకుండా శుక్రవారం కురిసిన వర్షానికి మొక్కజొన్న వానపాలైంది. మండలంలో 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది. సర్వీసు రహదారులపై ఆరబెట్టుకున్న మొక్కజొన్న పంట తడిచి దెబ్బతినింది. కొందరు రైతులు పట్టలు కప్పారు. ప్రధానంగా గొడిగనూరు, శెట్టివీడు, ముత్యాలపాడు గ్రా మాల రహదారిపై ఆరబెట్టుకున్న ధాన్యం తడిచి దెబ్బతింది. ప్రభుత్వం స్పం దించి పంటను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

రుద్రవరం: ఎడతెరిపి లేని వర్షాలకు మొక్కజొన్న పంట నేలపాలైంది. మండలంలో సుమారు 3920 హెక్టార్లలో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. పంట కోతకు వచ్చే సమయంలో వర్షం తీవ్రంగా దెబ్బతీసింది.

చాగలమర్రి: వర్షాలు పడుతుండటంతో మట్టిమిద్దెల్లో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని హౌసింగ్ ఏఈ నవీన్‌కుమార్ సూచిం చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ముత్యాలపాడు గ్రామంలో వర్షానికి మట్టిమిద్దె కూలి దెబ్బతిందన్నారు.